# యేమిటో, బ్రతికున్నాళ్లా ....ఈ మూర్ఖత్వం!

లలితాదేవి

★

నా పేరు రజియాబీబీ. మేము ముసల్మాను మతస్థులము. అయినప్పటికీ ఊళ్ళో హిందూ ముస్లిములకు ఆదినుండీ ఉన్న స్నేహబంధంవల్ల మేము హిందువుల బస్తీలోనే నిర్భయంగా ఉంటున్నాము. ఇరుగుపొరుగున ఉన్న హిందువులు మాకన్ని విధాలా సహాయపడేవాళ్లు. మా అమ్మకు నేనూ అన్నయ్యా ఇద్దరమే సంతానం. మా నాన్న నా చిన్నప్పుడే పోయాడట. మా అన్నయ్య ఏదో బ్యాంకులో క్లర్కు పని చేస్తున్నాడు. ఆ వచ్చే జీతంరాళ్ళ మీదుగానే మా ముగ్గురిజీవనం ఎలాగో వెళ్ళిపోతున్నది.

ఇలా ఉండగా ఎన్నడులేంది మా వూళ్ళో మతకలహాలు ఆరంభమయ్యే సూచనలు కనిపించాయి. అన్నయ్య రోజూ పనిలోకి వెళ్ళక తప్పదు. అమ్మకు ఈనడుమ సరిగ్గా కళ్ళు కనబడటంలేదు. అందుచేత బజారుసామానులు అన్నీ నేనే తేవలసివస్తోంది. చాలా నాళ్ళనుండి హిందువులతో కలసిఉన్నందున మాకు ఘోషాకూడ అట్టే లేదు. ఆ వున్న కొద్దిపాటైనా పరిస్థితులనుబట్టి పూర్తిగా పోయింది.

మతకలహాలు ఆరంభమయినై. అక్కడక్కడ ముస్లిములు తమబస్తీల్లో ఉన్న హిందువులను నరికేస్తున్నారు. హిందువులుమాత్రం ఊరుకుంటారా? ఎప్పుడో సమయం కనిపెట్టి పగదీర్చుకుంటారు. నాకుమాత్రం చాలా భయమేసేది.

అబ్బ, భయపడ్డంత పని జరిగింది. ఒకరోజున నేను బజారుకెళ్ళివస్తున్నాను. వీధుల్లో అంతా గందరగోళంగా ఉంది. ముస్లిములు హిందువులను, హిందువులు ముస్లిములను పొడుచుకుంటున్నారు. రోడ్లన్నీ రక్తప్రవాహాలతోటీ, శవాలతోటీ నిండి ఉన్నాయి. నాకు భయమేసి పరుగు లంకించుకున్నాను. నా వెనుక ఎవరో పెద్ద అల్లరిచేస్తూ పరుగెత్తుకొనివస్తున్నట్టయింది. ఆ భయంలోకూడ ఒకసారి వెనుదిరిగిచూచాను. కొందరు గుండాలు కత్తులతోటీ కటార్లతోటీ నా వెంటబడ్డారు. నా పైప్రాణాలు పైననే ఎగిరిపోయాయి. సందు మలుపులో ఒక ఇంటితలుపు తీసిఉండటం చూచాను. రెండంగల్లో లోపలికెళ్ళిపడి తలుపు గెడవేశా. తరువాత అయిదు నిమిషాలవరకు నావంటిమీద స్పృహ లేదంటే నమ్మండి. తరువాత కండ్లు తెరచిచూడగా ఒక యువకుడు నాకు విసురుతూ కూర్చున్నాడు. బాగా పరకాయించిచూస్తే అతడు హిందువు. నాకు మళ్లీ గుండెల్లో దడ పుట్టింది. లేచి అతని కాళ్ళమీద పడి నాకు ప్రాణభిక్ష పెట్టమని ఏడ్చాను. అతడు నన్ను లేవనెత్తి నీకేమీ భయంలేదని ఓదార్చాడు.

* [illegible]

ఇంతలో తలుపుమీద దభీదభీమని గుద్దులు వినిపించాయి. నన్ను పడకటింట్లో మంచంక్రింద దాచి అతను వెళ్ళి తలుపుతీశాడు. నన్ను వెంబడించిన గూండాలే వచ్చి ఇల్లంతా కలయదిరిగి చూచుకున్నారు. నే నగపడకపోవడంచేత ఇక్కడికి రాలేదని తలచి వచ్చినదారినే వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళేదాక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చప్పుడుచేయక అలాగే పండుకున్నాను. తరువాత వీధితలుపు గడియవేసేసి ఆ హిందూ యువకుడు (అతని పేరు కిశోర్ అని తర్వాత తెలుసుకున్నాను) వచ్చి భయంలేదు వాళ్ళు వెళ్ళిపోయారని చెప్తే అప్పుడు దిగులుదీరి బయటికి వచ్చాను. తరువాత నాలుగురోజులవరకు వీధితలుపు తెరువనేలేదు. ఈలోపుగా కిశోర్‌కూ నాకూ పరిచయం స్నేహంలోకి దిగింది. కిశోర్ బ్రాహ్మలబ్బాయి. చదువుకోసం స్వగ్రామంనుంచి వచ్చి ఇక్కడ ఒక ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఒక వృద్ధబ్రాహ్మడు వంటచేసి పెడుతుంటాడు. ఈ నాలుగు రోజులు ఇంట్లో ఉన్న వస్తువులతోటే సరిపెట్టుకున్నాము. కూరగాయలకైనా వీధిగుమ్మం త్రొక్కలేదు. తరువాత అల్లర్లు అణగినవి. పట్నమంతా మళ్ళీ ప్రశాంతంగా ఉంది. ప్రజలు మళ్ళీ వీధుల్లో తిరుగుతున్నారు. అమ్మా, అన్నయ్యా ఏమైనారో అన్న ఆదుర్దా ఎక్కువైంది. కిశోర్‌తోటి చెప్పితే తనుకూడ వస్తానన్నాడు. ఇద్దరం బయలుదేరి మా ఇంటికెళ్ళాము. కాని ఇంట్లో ఎవ్వరూ లేరు. ప్రక్కింటి ప్రసూనమ్మగారినడిగితే మొన్నటి మతకలహాల్లో గూండాలచేత మా అమ్మా అన్నయ్యా...అబ్బ నేనింక చెప్పలేను...

ఆ మాట వినేసరికి నా కండ్లు తిరిగినై. ముచ్చెమ్మటలూ పోసినై. నిలబడలేక అక్కడనే కూలబడ్డా.

అలా ఎంతసేపేడ్చానో తెలియదు. కిశోర్ నన్ను లేవదీసి మెల్లగా నడిపించుకుంటూ ఇంటికి తీసికెళ్ళాడు. నాలుగైదు రోజులీ విచారంతోనే గడచిపోయినవి. అప్పుడు తట్టింది ఇకముందు నా జీవనోపాధి ఎట్లా అని. ఒక్కసారి ఈ విశాల జగత్తులో నేను దిక్కులేనిదాన్నయిపోయానని తలంపు రాగానే భోరున ఏడ్చాను. కిశోర్ వచ్చి ఏమిటి సంగతని గుచ్చిగుచ్చి అడిగాడు. నా కథంతా విని నవ్వి పిచ్చిదానా నేను నిన్ను విడిచిపెడ్తాననే అనుకున్నావా అన్నాడు. నాకు చాలా ఆశ్చర్యమేసింది. 'అదేమిటీ మీరు బ్రాహ్మలు నేను ముస్లిమును. మీ నాన్నగారికి తెలిస్తే ఇంకేమైనా వుందా? మీ వంటబ్రాహ్మడప్పుడే కస్సుబుస్సుమంటున్నాడు' అన్నాను. దానికి ప్రత్యుత్తరంగా అతను నా కండ్లలోకి అదోవిధంగా చూచాడు. నా వళ్ళు జలదరించింది, నిజంగా అతనిలో ఏదో ఆకర్షణశక్తి ఉంది. నాకు అపరిమితమైన సిగ్గేసి ముఖం దిండులో దాచుకున్నాను.

రెండుమూడు రోజులయింతర్వాత వంటబ్రాహ్మడు తురకపిల్ల ఉన్న ఇంట్లో ఉండి తను మైలబడిపోతున్నానని గోలెత్తి ఇంటికెళ్ళిపోయాడు. ఇప్పుడు వంటసమస్య ఒకటి కొత్తగా వచ్చిపడింది. రెండురోజులు క్యారేజి తెప్పించుకున్నాము. కాని ఖర్చు అధికమవడంవల్ల కిశోరే వండిపెట్టడానికి ప్రయత్నించాడు. ఎన్నడు అలవాటులేనందున చేతులు కాల్చుకున్నాడు. ఇంక విధిలేక నేనే వండవలసివచ్చింది. ముసల్మాను యువతి వండితే స్వచ్ఛమైన బ్రాహ్మడు భోజనం చేయడం నిజంగా ఆశ్చర్యకరమైన విషయమే. పరిస్థితులలా ఉన్నాయి. అదీగాక మా ఇద్దరి మధ్య ఉన్న భేదభావం క్రమంగా నశించిపోయింది. నన్ను చూడందే ఒక్కక్షణంకూడా ఉండలేకపోతున్నాడు కిశోర్. కాలేజీకి వెళ్ళినంతసేపు ఎలా ఉంటున్నాడో కాని...ఏమిటో ఉత్తర దక్షిణధృవాలలాగ ఉన్న మా ఇద్దరి మధ్య ఈ అపూర్వప్రేమపాశం!

అన్నట్టు మరిచాను. కిశోర్ తండ్రివద్దనుండి జాబువచ్చింది. వంటబ్రాహ్మడివల్ల విన్నాడట నన్ను గురించి. నన్ను తత్‌క్షణం వెళ్ళగొట్టవలసిందనీ, ఇంటికి వచ్చి ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందనీ ఏమేమో వ్రాసాడు. కాని కిశోర్ మాత్రం అతనిమాటలేవీ లక్ష్యపెట్టలా. పరీక్షలు నెలరోజులే ఉన్నందున దీక్షగా చదువుతున్నాడు.

వారంరోజులతర్వాత మళ్ళీ ఉత్తరంవచ్చింది. ఈసారి చాలా కఠినంగా వ్రాసాడు. తన మాట వినకపోతే చిల్లిగవ్వకూడా దక్కనీయననీ, జాతిభ్రష్టుడైన కుమారుడు ఉన్నా చచ్చినవాళ్ళలో జమేననీ వ్రాసాడు. ఇప్పుడుకూడ కిశోర్ ఏమి ప్రత్యుత్తరం వ్రాయలా. [illegible]

భయమేసింది. ఆ నెల ఇంటినుండి డబ్బు రాలేదు. ముందుగతి? నిత్యానందుడైన కిశోర్ అప్పటినుండీ విచారంగా ఉంటున్నాడు. అతన్ని చూచేవరకే నా గుండె తరుక్కుపోయేది. కాని దీనిమూలంగా దుఃఖప్రాణి కోటి యాతనలూ తను నిత్యవిధులను నిర్వర్తించుకుంటూ తన జీవితాలను వెళ్ళబుచ్చుకుంటున్నదో ఆ "ఆశ" అన్న ఒక్క అమృతమయమైన పదమే మా ఇద్దరికీకూడా ధైర్యంగొలిపేది. పరీక్షలు నెలరోజులున్నవి. తరువాత రెండునెల్లకిగాని ఫలితాలు తెలియవు. ఈ మూడు నెలలు ఎలాగో గడిపితే తరువాత ఏదైనా ఉద్యోగం దొరకవచ్చు అని దినాలు లెక్కపెట్టుకుంటూ గడుపుతున్నాము. కిశోర్ పరీక్షలకు బాగా చదువుతున్నమూలాన వేరే సంగతులేవీ పట్టించుకునే తీరిక లేకపోయేది. ఇట్లా తినుబండారాలన్నీ ఆఖరయినై. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఏమి చేయటానికీ పాలుపోలేదు. ఎంతోసేపు ఆలోచించాను. కిశోర్‌కుమాత్రం ఈ విషయం చెప్పి బాధపెట్టదలుచుకోలేదు. ఆఖరికి ఒక ఊహ తట్టింది. మా అమ్మవి ఒక లెక్లేసు, తోడాలజతా ఉన్నాయి. బజారుకెళ్ళి వాటిని అమ్మి మూడు నాలుగు నెలలకు సరిపడే సామాను తెచ్చాను. ఇంటికి వచ్చేసరికి కిశోర్ లేడు. కనుక అతనికి తెలిసే అవకాశం లేకపోయింది.

పరీక్షలయిపోయినై. కిశోర్ బాగానే వ్రాసాడట. సెలవులుకూడా పూర్తిగావచ్చినై. ఒకనాడు మేమిద్దరం వరండాలో కూర్చుని ఏదో పిచ్చాపాటి మాట్లాడుకొంటుండగా కిశోర్ ఉన్నట్టుండి అకస్మాత్తుగా అడిగాడు నీ మెళ్ళోని నెక్లేస్ ఏది రజనీ అని. నేను ఏదైతే అతన్నించి దాచాలని ప్రయత్నించేనో దాన్నిగురించే అతను ప్రశ్నించుతున్నాడు. నేను జవాబు చెప్పలేక తికమకపడుతున్నాను. అప్పుడు అతనే నా తాళంచెవి తీసికొని పెట్టెతెరచి చూచాడు. నెక్లేసుకు తోడు తోడాలుకూడా లేవు. వెలవెలబోతున్న నా మొహంకేసిచూసి చప్పున విషయం గ్రహించాడు. కాని నాతోమాత్రం ఏమి అనలేదు. అప్పటినుండీ అతను మౌనంగా ఏదో ఆలోచించుకూండేవాడు. తర్వాత కొద్దిరోజుల్లోనే పరీక్షాఫలితాలు ప్రకటితమయినై. కిశోర్ L.M.P. తరగతిలో ప్రథముడుగా ఉత్తీర్ణుడైనాడు. కాని ప్రాక్టీసు పెడదామంటే డబ్బులేదు.

ఆఖరికి వీళ్ళను వాళ్ళను ప్రాధేయపడగా జెనరల్ హాస్పిటల్లో అసిస్టెంటుసర్జను పని దొరికింది. పేదకు పెన్నిధి దొరికినట్టయింది మాకు. రోజులు నెలలు ఆఖరికి సంవత్సరాలుకూడా గడిచాయి. ఈలోపుగా కిశోర్ నాకు నెక్లేస్, తోడాలకు బదులు వడ్డాణం, ఇంకా ఏవేవో చిల్లర నగలు చేయించాడు. నే నమ్మిన వస్తువులకు బదులు మళ్లీ చేయించినతర్వాతగాని అతను మనశ్శాంతి పొందలేదు. కిశోర్ నన్ను పూర్తిగా హిందూ స్త్రీలాగ మార్చేశాడు. నాకు వడ్డాణం మొదలైన నగలన్నీ పెట్టి, బొట్టుపెట్టి అలంకరించి గంటలతరబడి చూస్తూ ఆనందించేవాడు. ఎంత ప్రయత్నించినా కాని అతని చూపుల్నిమాత్రం నా చూపులు ఎదుర్కోలేకపోయేవి. అతను చూస్తున్నంతసేపు నాకదోకలా ఉండేది. అతనికండ్లలో అంత తేజస్సు ఉండేమో!

ఒక శుభముహూర్తాన మాకిద్దరికీ ఆర్యసామాజికపద్ధతిప్రకారం వివాహం జరిగింది. వివాహమైననుంచీ నన్ను రజనీ అని పిలుస్తున్నాడు.

ఒకరోజున మా ఊరినుండి టెలిగ్రామ్ వచ్చింది. కిశోర్ ఇంట్లో లేడు. నేనే వణకుతూ విప్పిచదివాను. అందులో మా మామగారు చావుబ్రతుకులమీద ఉన్నారు రమ్మని ఉంది. సామాను అంతా సర్ది పెట్టి కిశోర్ హాస్పిటల్‌నుండి రాగానే టెలిగ్రాం చూపించాను. ఆదేరాత్రి బండికి బయలుదేరి స్వగ్రామం చేరుకున్నాము. మేము వెళ్ళేసరికి మామగారికి పూర్తిగా ప్రాణంమీదికొచ్చి ఉంది. వారి చూపులు దేన్నో వెతుకుతున్నాయి. కొంతసేపటికి అవి నామీద కిశోర్‌మీదపడి నిశ్చలంగా నిలిచిపోయినై. కండ్లనుండి సంతతధారాపాతంగా అశ్రుధారలు రాల మొదలిడినై. కిశోర్ ఇంక ఉండబట్టలేక తండ్రిమీదబడి విలపించాడు. కొనప్రాణంతోటి ఉన్న తండ్రి నావైపు చూశాడు. నేనతని సంజ్ఞ గ్రహించి మంచానికి అటువైపు వెళ్ళి కూర్చున్నాను. మా ఇరువురి తలమీద చేతులిడి (మనసులో ఏమేమి దీవించారో) ప్రాణం విడిచారు మా మామగారు. అంత పట్టుపట్టినా ఆఖరికి వారి యావదాస్తీ మాకే చెందింది. ఏమిటో బ్రతుకున్నన్నాళ్లూ ఈ మూర్ఖత్వం.

---

* ఆనంద వాణి.

G. RA...